మహిళా దినోత్సవం సందర్భంగా మహిళతో జీవన్‌రెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

• పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 10: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగిత్యాలలోని టవర్ సర్కిల్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతితో కలిసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పాతబస్టాండ్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకత, హోదాను, గుర్తింపును తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్ అనిత, మహిళలు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలతోనే కీర్తి

ప్రపంచ దేశాల్లో దేశ గుర్తింపు, కీర్తి ప్రతిష్టకు కారణం మనం ఆచరించే సంస్కృతీ సంప్రదాయాలేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో 32 ఏండ్లుగా జగిత్యాలలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాస విద్యాలయాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. రాజకీయ జీవితంలో ఎన్నో పార్టీలను చూశానని, తాను ఏ పార్టీలో కొనసాగినప్పటికీ ప్రజాసేవయే ప్రధానంగా పనిచేస్తున్నానన్నారు. పార్టీలకతీతంగా ప్రజాసేవ చేయడం తన బాధ్యత అన్నారు. దేశ భవిష్యత్తుకు తోడ్పడేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వాల్మీకి ఆవాసానికి గతంలో రూ.5 లక్షలు కేటాయించానని, దీనికి తోడు మరో రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు జీవన్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ఆవాస భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ భీమ నాతిని శంకర్, ఆవాస అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, మదన్ మోహన్‌రావు ఉన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

మెట్‌పల్లి, మార్చి 10: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో మెగా జాబ్ మేళాను సోమవారం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి సంజీవ్, ఆకుల ప్రవీణ్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హులైన వారిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో జరగనున్న మెగా జాబ్‌మేళాకు ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీ ఐ, ఫార్మసీ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన వారు హాజరు కావాలన్నారు. కోరుట్ల నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

నలుగురికి తీవ్రగాయాలు

కథలాపూర్, మార్చి 10: భూషణరావుపేట శివారులో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌కు చెందిన చెప్యాల గంగారాం, చెప్యాల గంగు, దర్శనం శారద, బోయిని ఉమ ఆటోలో శనివారం రాత్రి 10 గంటలకు కథలాపూర్ మండలం చింతకుంటకు వెళ్తున్నారు. భూషణరావుపేట శివారులో ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. క్షతగాత్రులను చికిత్స కోసం కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల దవాఖానలకు తరలించామని గ్రామస్తులు వివరించారు.

అబద్ధాల హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

మూడు నెలల్లోనే ప్రజలు ఈసడించుకుంటున్నారు

• పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం • మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, మార్చి 10: 'అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు మూడు నెలలకే ఈసడించుకుంటున్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది' అని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం వెల్గటూర్‌లో ఎండపల్లి, వెల్గటూర్ ముఖ్య కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఒక బొమ్మరిల్లులా తయారు చేసి ఇస్తే, పరిపాలించడం తెలియక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ఇతర వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. కేసీఆర్‌కు మించి పనులు చేస్తారని ఊహించి అధికారమిస్తే కనీసం రైతులకు సాగు నీరు కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను ఆదరిస్తారన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి, గతంలో బీఆర్ఎస్ ప్రజలకు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ఓటు అడగాలని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి, వెల్గటూర్, ఎండపల్లి నాయకులు కొప్పులకు సన్మానం చేశారు. అనంతరం వెల్గటూర్‌కు చెందిన సీనియర్ కార్యకర్త కస్తూరి హన్మాండ్లు, మూగల రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చల్లూరి రాంచందర్‌గౌడ్, సింహాచలం జగన్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, నాయకులు గాజుల మల్లేశం, ఏలేటి కృష్ణారెడ్డి, మూగల సత్యం, గూడ రాంరెడ్డి, గోలి రత్నాకర్, గండ్ర నర్సింగరావు, సింధూజరెడ్డి, రామడుగు రాజేశ్, పోడెటి రవి, జగదీశ్వర్ గౌడ్, శ్రీనివాస్, మాజీ సర్పంచులు, గ్రామాధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్, హాజరైన కార్యకర్తలు

కేసీఆర్‌ను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, మార్చి 10: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు.

సమన్వయ లోపంతోనే విద్యుత్ అంతరాయం

జగిత్యాల, మార్చి 10: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా శాఖల మధ్య సమన్వయ లోపంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్‌లలో మెయింటనెన్స్ కోసం చేసిన విద్యుత్ సరఫరా నిలిపివేత కరెంట్ కోతగా చెప్పడం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులు, కార్యక్రమం సమాచారాన్ని విద్యుత్ శాఖకు తెలియపరచకపోవడం వల్లే సరాఫరా నిలిపివేశారన్నారు. అనంతరం సమాచారం అందించి, విద్యుత్‌ను పునరుద్ధరించామన్నారు. ప్రభుత్వ కార్యక్రమం సమాచారం ముందుగా తెలియకపోవడం, విద్యుత్ కొరత కాదని తేల్చి చెప్పారు.

గల్ఫ్ కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలి

మెట్‌పల్లి రూరల్, మార్చి 10: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ అధ్యక్షుడు రాజాగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి, ఇచ్చిన హామీల అమలుకు కనీసం చర్యలు చేపట్టలేదని వాపోయారు. తాత్కాలిక బడ్జెట్ సమావేశాల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రస్తావన కూడా లేదన్నారు. ఎన్ఆర్ఐ వ్యవహారాల కోసం మంత్రిని నియమించలేదని, ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించలేదని విమర్శించారు. ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన రెండువేల మంది కార్మికులు గల్ఫ్ దేశాల్లో మృతి చెందారని వెల్లడించారు. హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని, గల్ఫ్‌లో మరణించిన కార్మిక కుటుంబానికి రూ. ఐదు లక్షల పరిహారం చెల్లించాలని, గల్ఫ్ కార్మికుల సమస్యలు తెలుసుకునేందుకు హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడిగా మహర్షి

సన్మానిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

మెట్‌పల్లి, మార్చి 10: అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మెట్‌పల్లికి చెందిన బీవీ మహర్షి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని నిఖిల్ భరత్ కాన్వెంట్ స్కూల్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడితో పాటు ముఖ్యసలహాదారుగా విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఆల్ రౌండర్ గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా శ్రీలత, భవాని, బానేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, కోశాధికారి కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అంజయ్య, గజెల్లి రాందాస్ పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో ముగిసిన క్రీడా పోటీలు

వాలీబాల్ విజేత జట్టుతో ఏఎస్ఐ సత్తయ్య, నిర్వాహకులు

పెగడపల్లి, మార్చి 10: పెగడపల్లిలోని జడ్పీ పాఠశాలలో ఎన్‌వైకే ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో వాలీబాల్, ఖోఖో, పరుగు పందెం పోటీలు నిర్వహించగా, 6 క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఏఎస్ఐ సత్తయ్య, యువజన సంఘం నాయకుడు మర్రిపెల్లి గంగాధర్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు రమేశ్, మహేశ్, యూత్ సభ్యులు ప్రశాంత్, రాజేందర్, రమేశ్, చరణ్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నిర్వహణపై వివాదం

జగిత్యాల రూరల్, మార్చి 10: హస్నాబాద్, చల్‌గల్ శివారులోని వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణ విషయంలో ఇరు గ్రామాల మధ్య రెండు రోజులుగా వివాదం జరుగుతున్నది. ఆదివారం చల్‌గల్ గ్రామస్తులు ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు వర్గాల పెద్దలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సయోధ్య కుదిర్చారు. చల్‌గల్, హస్నాబాద్, ఉప్పరిపేట, చర్లపల్లి గ్రామస్తులు మంగళవారం ఆలయ కమిటీ ఏర్పాటు చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని పోలీసులు వారికి సూచించారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ఉపాధ్యాయురాళ్లను సన్మానించిన పీఆర్టీయూ నాయకులు

జగిత్యాల టౌన్, మార్చి 10: పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు సిద్దిపేటలోని రంగనాయకసాగర్ పంప్‌హౌస్, కోమటి చెరువు, శారదాపీఠం, కోటిలింగాలు ఆలయాలను సందర్శించుకొని సిద్దిపేట పీఆర్టీయూ భవనంలో మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సతీమణి గంగమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శాఖ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

• విప్ ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, మార్చి 10: కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగింటిని అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం గొల్లపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మండలంలోని 119 మంది లబ్ధిదారులకు రూ. కోటీ 19లక్షల 13వేల 804 విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిషాంత్ రెడ్డి, తహసీల్దార్ జమీరొద్దిన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రావు, సర్పంచులు గంగాధర్, సత్యనారాయణగౌడ్, నాయకులు రమేశ్ రెడ్డి, మహేశ్, వెంకటేశం పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికి కట్టుబడి ఉంది

జగిత్యాల, మార్చి 10: మహిళా అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాలలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో ఆదివారం జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నారి న్యాయ సమ్మాన్ సమ్మరోహ్'లో లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం విజయలక్ష్మి ఆధ్వర్యంలో విప్‌తో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి, మహిళా కాంగ్రెస్ పట్టణాధ్యక్షురాలు అనిత, ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో అడ్లూరి లక్ష్మణ్ కుమార్

చెరుకు రైతులకు సన్మానం

మెట్‌పల్లి, మార్చి 10: ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం ఉద్యమించిన పలువురు చెరుకు రైతులను ఆదివారం మెట్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక సంస్కరణల పేరిట నిజాం చక్కెర ఫ్యాక్టరీలను ప్రైవేటీకరణ చేసి చెరుకు రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రైవేట్ భాగస్వామ్యం నుంచి విముక్తి కల్పించి ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని చక్కెర ఫ్యాక్టరీని నడిపించేందుకు మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు ఎంతో కృషి చేశారని పలువురు నాయకులు కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతుండడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కరంచంద్, విజయ్‌ఆజాద్, హన్మాండ్లు, నారాయణరెడ్డి, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘ నాయకులు

ఉద్యోగాలు సాధించిన యువతకు సన్మానం

పెగడపల్లి, మార్చి 10: బతికపల్లికి చెందిన ఆరుగురు పద్మశాలీ యువత, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. దీంతో ఆదివారం పద్మశాలీ మండల సంఘం ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. గ్రామానికి చెందిన వొల్లాల మమత, ఎలగొండ గంగాజల, కోమాకుల రాజు జూనియర్ లెక్చరర్లుగా, పెంట వినయ్, నల్ల సౌమ్య నర్సింగ్ అధికారులుగా, సామల వరలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయినిగా ఉద్యోగాలు సాధించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు గంగ మల్లేశం, సంఘం నాయకులు రాయమల్లు, నర్సయ్య, మల్లేశం, గంగాధర్, కృష్ణహరి, గోపికృష్ణ, రమేశ్ ఉన్నారు.

నూతన నియామకం

కోరుట్ల, మార్చి 10: పట్టణానికి చెందిన 21వ వార్డు కౌన్సిలర్ అన్వర్ జిల్లా రైస్ మిల్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన అసోసియేషన్ సభ్యుల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా ఖలీల్, కోశాధికారిగా రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. రైస్ మిల్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమ వంతుగా పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నూతన పైప్‌లైన్ నిర్మాణం

పెగడపల్లి, మార్చి 10: పెగడపల్లిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి గానూ నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు మిషన్ భగీరథ డీఈ మురళి పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం పెగడపల్లిలో నూతన పైప్‌లైన్‌కు సంబంధించి డీఈ పరిశీలన చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాములుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, విజయభాస్కర్, కిషన్, వంశీధర్‌రావు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

ధర్మపురి, మార్చి 10: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన నర్మల రాజశేఖర్ కుటుంబానికి 2005-2007 అగ్రికల్చర్ డిప్లొమా మిత్రులు ఆర్థిక సాయం అందించారు. రూ.55వేలను జమ చేసి ఆదివారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నర్మల నరేశ్, వేముల కార్తీక్, మద్ది మహేశ్, అశోక్, రవిచంద్రరెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెగడపల్లి/మేడిపల్లి, మార్చి 10: పెగడపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేడిపల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉమాదేవి ఆదివారం తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మేడిపల్లి, మార్చి 10: 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేయించుకొని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రామకృష్ణ, ఎన్ఎస్‌వీ డిగ్రీ, పీజీ కశాశాల అధినేత యాద రామకృష్ణ సూచించారు. ఆ కళాశాల విద్యార్థులు మేడిపల్లి మండలం పోరుమల్లలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. గ్రామంలో ప్రధాన వీధులగుండా ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అవగాహనలో ఎంపీపీ ఉమాదేవి, రాజరత్నాకర్ రావు, మాజీ సర్పంచులు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గోధూర్‌లో ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం, మార్చి 10 : వేంపేటకు చెందిన జయరాం ఆయుర్వేదిక హాస్పిటల్ డాక్టర్ బొబ్బిలి మోహన్ బొక్కల దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం గోధూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో 110 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమేశ్వరి, జగన్‌రావు, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కథలాపూర్, మార్చి 10: దుంపేటలో బాలరాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీని ఎస్ఐ నవీన్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. టోర్నీలో 16 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రూప్స్ శిక్షణకు గడువు పొడిగింపు

జగిత్యాల రూరల్, మార్చి10: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు ఈనెల 12 వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

• భక్తజన సంద్రమైన దుబ్బ రాజన్న క్షేత్రం
• ముగిసిన బ్రహ్మోత్సవాలు

సారంగాపూర్/మల్లాపూర్/రాయికల్/మెట్‌పల్లి రూరల్/ధర్మపురి రూరల్, మార్చి 10: సారంగాపూర్ మండలంలోని పెంబట్ల దుబ్బ రాజన్న క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఉత్సవమూర్తులను పల్లకీలో గుడి చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి లక్షకు పైగా తరలివచ్చిన భక్తులతో పురవీధులన్నీ కిక్కిరిసి పోయాయి. ఐదు రోజులుగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలు రథోత్సవంతో ముగిశాయి. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో డీఎస్పీ, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు జిల్లా కేంద్రం నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నడిపించారు. ఆర్య వైశ్య సంఘం, దుబ్బ రాజేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, ఈవో అనూష, ఆలయ ట్రస్టు ఫౌండర్ శంకరయ్య, మాజీ సర్పంచులు రాజన్న, జమున, రమేశ్, సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు రాజన్న, ప్రధానకార్యదర్శి మల్లికార్జున్, అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, కైలాసం, మధూకర్, సాగర్, రజినీకాంత్, రవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గుట్ట రాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లోని గుట్ట రాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ చేశారు. రథోత్సవం నిర్వహించారు. మల్లాపూర్‌లోని కనక సోమేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో రథోత్సవం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సోమేశ్వరస్వామి శివదీక్షాపరులు, భక్తులు కలిసి సోమేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. మల్లాపూర్ మండలం వేంపల్లిలో రాజరాజేశ్వరస్వామి ఆలయం (పురాతన శివాలయం) జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించారు. రాయికల్ మండలం కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయంలో స్వామివారి రథోత్సవం నిర్వహించారు. రథంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులతో గుడి చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేశారు. మెట్‌పల్లి రూరల్ మండలం జగ్గసాగర్ శివారులోని నవదుర్గ శనేశ్వర శివాలయ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. మహాశివరాత్రి తర్వాత వచ్చే అమావాస్య రోజున ఆలయంలో జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన, అభిషేకం, హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి రూరల్ మండలం నేరెళ్ల అటవీ ప్రాంతంలోని సాంబశివ ఆలయంలో ఆదివారం గ్రామస్తులు, భక్తులు ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు.

పెంబట్లలో దుబ్బరాజేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**